సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



నిత్యాన్నదానానికి విరాళం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో నిత్యాన్నదానానికి కళ్లెపు నాగేశ్వరరావు దంపతులు (ఉండ్రాజవరం) రూ.50 వేలు విరాళంగా అందజేశారు.



ఏకాదశి ఉత్సవం

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల చినవెంకన్నకు ఏకాదశి ఉత్సవాన్ని బుధవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. గ్రామోత్సవం అట్టహాసంగా జరిగింది.

వైభవంగా ఉత్సవ శాంతి



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో యోగాంజనేయస్వామికి ఉత్సవ శాంతిని నిర్వహించారు.

న్యూస్‌రీల్

అంతర్వేది ఉత్సవాలకు భక్తజనం



నరసాపురంలో పంటుపై భక్తులు

నరసాపురం: కోనసీమ జిల్లా **అంతర్వేదిలోని లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవాల సందడి** నరసాపురంలో కనిపించింది. పట్టణంలోని పంటు రేవు నుంచి గోదావరి దాటి అంతర్వేదికి అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. మంగళవారం రాత్రి స్వామి కల్యాణం, బుధవారం మధ్యాహ్నం రథోత్సవాన్ని చూసిన భక్తులు తిరుగు ప్రయాణంలో పెద్ద సంఖ్యలో రేవు దాటారు. భక్తులకు స్టీమర్‌రోడ్డు పొడవునా రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల వారు అల్పాహారం అందజేశారు. ఇదిలా ఉండగా గతంలో నరసాపురం నుంచి అంతర్వేదికి లాంచీల ప్రయాణం అందుబాటులో ఉండేది. పదేళ్లుగా లాంచీల సౌకర్యం ఉండటం లేదు.

జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ



బాలాజీని అభినందిస్తున్న దృశ్యం

వీరవాసరం : వీరవాసరం ఎస్‌ఎంబీటీఏవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థి పాలా బాలాజీ జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో మూడో స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ వలవల నర్సింహారావు తెలిపారు. ఇటీవల మహారాష్ట్రంలోని కొల్హాపూర్‌లోని శివాజీ వర్సిటీలో జరిగిన పోటీల్లో నన్నయ వర్సిటీ తరపున బాలాజీ పాల్గొన్నాడని చెప్పారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వర్ధినీడి సత్యనారాయణ, పీడీ చింతా సతీష్ తదితరులు బాలాజీని అభినందించారు.

నేటి నుంచి సైన్స్ ఎగ్జిబిషన్



రిజిస్ట్రేషన్ చేస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి, భీమవరం : పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం హైస్కూల్‌లో గురువారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించే జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్‌కు బుధవారం పాఠశాలలో నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే ఎగ్జిబిషన్‌కు పెద్ద ఎత్తున ప్రాజెక్టులు వస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, డీఎస్ఓ వీఎం శ్యామ్‌ప్రసాద్ చెప్పారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు



సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

పెంటపాడు: సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు వ్యవసాయం లాభసాటిగా మారుతుందని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) జెడ్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆకుతీగపాడులో బుధవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కె.పార్థసారథి అధ్యక్షతన జరిగిన పొలంబడి కార్యక్రమంలో డీఏఓ మాట్లాడారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. గుంటూరు కమిషనరేట్ ఏడీఏ ఐకే శ్రీనివాస్ వరిపైరుపై ఆశించే తెగుళ్ల నివారణపై మాట్లాడారు. కేవీకే శాస్త్రవేత్తలు మల్లికార్జునరావు, రాజేష్, విజయలక్ష్మి కుళ్లు తెగులు నివారణ చర్యలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. క్లస్టర్ పొలంబడిలో సభ్యులుగా ఉండే ప్రతి రైతు వారంలో ఒకసారి శాస్త్రవేత్తల సలహాలు తప్పక పాటించాలని ఏడీఏ మురళీకృష్ణ సూచించారు. సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు కొణతాల వెంకట్రావు, వీఏఏలు, రైతులు, వైఎస్సార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

● ఊరించి.. ఉసూరుమనిపించి..

పోలవరానికి మొండిచేయి



- నిట్ పనులకు కేటాయింపుల్లేవు
- కోటిపల్లి రైల్వేలైనుకు దక్కని నిధులు
- వ్యవసాయ, ఆక్వా రంగాలకు లభించని ఊరట
- 'ఉమ్మడి పశ్చిమ'కు రిక్తహస్తం
- కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఎలాంటి నిధులు లేవు.. కొత్త ప్రాజెక్టుల ఊసులేదు.. కొత్త పథకాలు లేవు.. మొత్తంగా కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మెట్టినింటికి పూర్తిగా అన్యాయం జరిగింది. జాతీయ ప్రాజెక్టు అయిన 'పోలవరం' మొదలు రైల్వే ప్రాజెక్టుల వరకు ఏ ఒక్క ప్రాజెక్టుకు నామమాత్రంగానైనా నిధులు కేటాయించని పరిస్థితి. సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగంలో కనీసం జిల్లా ఊసే కనిపించకపోవడం దారుణం. జిల్లాలో అత్యంత ప్రాధాన్యమైన వ్యవసాయం, ఆక్వా రంగాలకు యథావిధిగా మొండిచేయి చూపారు. కేవలం ఆదాయపన్ను పరిధి పెంచడం మాత్రమే జిల్లాలోని వేతన జీవులకు స్వల్ప ఊరట. కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై జిల్లాలో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

పోలవరం.. లేదు కనికరం

కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేయాల్సిన కీలక ప్రాజెక్టుల్లో జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టుకు ప్రతి రూపాయి కేంద్రమే ఖర్చు పెట్టాలి. అయితే కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ఊసు, ప్రస్తావనే లేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ఏలూరు జిల్లాలోని మూడు మండలాల్లో 126 గ్రామాలు ఖాళీ చేయించి దాదాపు 25,100 కుటుంబాలను తరలించారు. వీరందరికీ నిర్వాసితుల ప్యాకేజీ కేంద్రమే చెల్లించాల్సి ఉంటుంది. గతేడాది ఆగస్టులో వరదల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అంతకు ముందు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. నిధులన్నీ కేంద్రమే ఇస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం, ముఖ్యమంత్రి పలు పర్యాయాలు కేంద్రానికి విన్నవించినా ప్రాజెక్టుపై కనికరం చూపలేదు.

నిట్‌కు నిధులేవి..?

జిల్లాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఏపీనిట్)కు నిధులు కేటాయించాల్సి ఉంది. తాడేపల్లిగూడెంలోని నిట్ రెండో దశ పనులకు రూ.735 కోట్లు ఖర్చవుతుందని అంచనాతో ప్రతిపాదనలను పంపగా మూడు విడతల్లో మంజూరు చేయాలి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.230 కోట్లు కేటాయించాల్సి ఉండగా ప్రస్తావన లేదు. ఇక జిల్లాలో కీలకంగా ఉన్న వ్యవసాయరంగానికి ఎలాంటి సబ్సిడీలు, కొత్త పథకాలు ప్రకటించలేదు. రెండు లక్షల ఎకరాల్లో ఉన్న ఆక్వా సాగుకు కూడా కేంద్ర బడ్జెట్‌లో ఊరట లేదు. ఇదిలా ఉండగా సుమారు 90 వేల మంది ఆదాయ పన్ను చెల్లింపుదారులకు మాత్రం స్వల్ప ఊరట లభించింది.

రైల్వే పనుల ప్రస్తావన లేదు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కీలకంగా ఉండే కోటిపల్లి–నరసాపురం రైల్వే పనులు, కొవ్వూరు–భద్రాచలం రైల్వే పనులపై ఎలాంటి ప్రకటన లేదు. కేవలం రైల్వేశాఖకు నిధులు కేటాయిస్తున్నామని ఏకవాక్యంలో బడ్జెట్ ముగించారు. నరసాపురం–కోటిపల్లి మధ్య 58 కిలోమీటర్ల దూరంతో రూ.2,800 కోట్ల వ్యయంతో రైల్వేలైన్ నిర్మాణ పనులకు 2016లో శ్రీకారం చుట్టారు. వాస్తవానికి 23 ఏళ్ల క్రితమే ప్రాజెక్టు మంజూరైనా 2016 నుంచి నిధుల కేటాయింపు ప్రారంభం కాలేదు. అయితే పనులు వేగవంతానికి మలివిడత నిధుల మంజూరుపై గత రెండు బడ్జెట్‌ల్లోనూ ఊసే లేదు. ఇది కాకుండా కొవ్వూరు–భద్రాచలం రైల్వేలైన్, కొవ్వూరు–సత్తుపల్లి లైన్‌గా మార్చే ప్రతిపాదనను గతంలో ఆమోదించారు. అయితే దీనిపైనా ఎటువంటి స్పష్టత లేదు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పలుమార్లు కేంద్ర రైల్వే మంత్రి, ఉన్నతాధికారులను కలిసినా ఏ మాత్రం పట్టించుకోలేదు. కొవ్వూరు–భద్రాచలం రైల్వేలైన్ పనులకు 2013లో రూ.923 కోట్లతో ఆమోదించినా ఇప్పటికీ కేంద్ర బడ్జెట్లలో ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు.

తీవ్ర నిరాశ



కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పర్చింది. ఏపీకి ప్రత్యేక హోదా అంశం లేదు. పోలవరం ప్రాజెక్టుకు నిధుల ప్రస్తావన లేకపోవడం దుర్మార్గం. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై పక్షపాత వైఖరి అవలంబిస్తోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచకపోవడం సరికాదు. వ్యవసాయ విద్యుత్ బిల్లును ఉపసంహరించుకుంటున్నట్టు చెప్పకపోవడం సరికాదు.

– బి.బలరామ్, సీపీఎం జిల్లా కార్యదర్శి, పశ్చిమగోదావరి

నిర్వాసితుల ప్రస్తావనేది



రాష్ట్రానికి చెందిన అంశాలు గానీ, మన జిల్లాకు వర్తించే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర బాధ్యతగా నిధులు కేటాయింపులు లేవు. నిర్వాసితుల పరిహారం కోసం ప్రస్తావన లేదు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కొవ్వూరు–భద్రాచలం, కొవ్వూరు–సత్తుపల్లి, కాకినాడ–కోటిపల్లి రైల్వే లైనులకు యథావిధిగా మొండిచేయి చూపారు.

– ఎ.రవి, జిల్లా కార్యదర్శి, సీపీఎం, ఏలూరు

పెన్షన్‌దారులకు ఊరట



సీనియర్ సిటిజన్స్, రిటైర్డ్ ఉద్యోగుల పొదుపుపై టాక్స్ శ్లాబ్‌లను పెంచడం హర్షణీయం. సీనియర్ సిటిజన్స్ గతంలో తమ పొదుపు రూ.7.50 లక్షలు దాటితే పెరిగే మొత్తంపై పన్ను విధించేవారు. ప్రస్తుతం కొత్త బడ్జెట్‌లో ఈ పరిమితిని రూ.15 లక్షలకు పెంచడం పెన్షన్‌దారులకు ఊరటనిచ్చే అంశంగా చెప్పవచ్చు. వేతన జీవులకు మేలు చేశారు.

– డాక్టర్ గుబ్బల తమ్మయ్య, రిటైర్డ్ ప్రిన్సిపాల్, తణుకు

సంతులితంగా..



ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు కోల్పోతున్న భారతీయులకు ఉద్యోగాలకు కల్పించేందుకు దేశం తీసుకునే చర్యల గురించి ప్రస్తావన లేకపోవడం నిరాశ కలిగించే అంశం. దీంతో పాటు దేశంలో వ్యవసాయ రంగానికి రుణాలు, డిజిటల్, మౌలిక సదుపాయాలు ప్రకటించినా ఇది సరిపోదు. బడ్జెట్‌ను జాగ్రత్తగా రూపొందించారు.

– డాక్టర్ జి.చంద్రప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపాల్, తణుకు

గృహనిర్మాణాలు వేగిరపర్చాలి

కలెక్టర్ ప్రశాంతి

ఉండి : జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం ఉండి, చెరుకువాడ గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెండో విడత పూడిక పనులు చేపట్టాల్సిన ఉండి హైస్కూల్ వద్ద లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇళ్ల స్థలాల కోసం 90 రోజుల ప్రణాళికలో భాగంగా అర్హులతో దరఖాస్తు చేయించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

చెరుకువాడలోని అర్తమూరు రోడ్డు లేఅవుట్‌ను పరిశీలించి అనుకూల ప్రాంతాల్లో ఇటుకల యూనిట్లు ఏర్పాటుచేయాలన్నారు. అధికారులు ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్మాణాల ప్రగతి కనిపించాలన్నారు. అనంతరం పాములపర్రు, కోలమూరులో సచివాలయాలను తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. పథకాల అమలులో నిర్లక్ష్యానికి తావు లేదన్నారు. సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించి ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల్లో తిరస్కరించిన అర్జీలపై ఆరా తీశారు. గృహనిర్మాణ శాఖ పీడీ అల్లూరి వెంకటరామరాజు, ఈఈ బీ వెంకటరమణ, తహసీల్దార్ ఎం.రవీంద్రకుమార్, ఎంపీడీఓ ఏవీ అప్పారావు, డీఈ శివరామరాజు పాల్గొన్నారు.



చెరుకువాడలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

96 శాతం ధాన్యం సొమ్ముల చెల్లింపు

సాక్షి, భీమవరం: జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు 96 శాతం నగదు నేరుగా వారి ఖాతాల్లో జమచేశామని కలెక్టర్ పి.ప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ 2022–23 సీజన్‌లో 3,78,900 టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా సేకరణ చేపట్టామని పేర్కొన్నారు. 296 రైతు భరోసా కేంద్రాల ద్వారా 98,117 మంది రైతుల నుంచి 3,75,000 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఈ మేరకు 93,392 మంది రైతులకు రూ.729.87 కోట్లు చెల్లించామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల ఖాతాల్లోకి నిర్ణీత సమయంలో నగదు జమ అవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో మిగిలిన ధాన్యం సేకరణ నిమిత్తం ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, వ్యవసాయ అధికారులను లేదా జిల్లా కంట్రోల్ రూమ్ 81216 76653కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని కలెక్టర్ సూచించారు.

త్వరితగతిన భూసేకరణ

జాయింట్ కలెక్టర్ మురళి

భీమవరం (ప్రకాశంచౌక్): అర్హులైన పేదలందరికీ 90 రోజుల్లో ఇళ్లస్థలాల పట్టాలు మంజూరు చేసేందుకు అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో గృహాలు మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభం కానీ లేఅవుట్లను సబ్ కలెక్టర్, ఆర్డీఓలు తనిఖీ చేసి నివేదిక అందించాలన్నారు. జిల్లాలో శ్మశానవాటికలకు అవసరమైన భూమిని సేకరించాలని, అభ్యంతరాలుంటే ప్రత్యామ్నాయాలను చూడాలని సూచించారు. ల్యాండ్ కన్వర్షన్, వన్ టైం కన్వర్షన్, మ్యుటేషన్ అంశాలపై సమీక్షించారు. ఎన్‌హెచ్–165, ఎన్‌హెచ్–216 నరసాపురం బైపాస్‌కు భూసేకరణ పూర్తి చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్డీఓ దాసి రాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ మురళి

బిందు సేద్యం లక్ష్యాలు సాధించాలి

ఏలూరు(మెట్రో): బిందు సేద్యంలో నిర్దేశించిన లక్ష్యాలను వచ్చే మార్చిలోపు సాధించాలని మైక్రో ఇరిగేషన్ శాఖ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ సీబీ హరినాథ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల అధికారులు, స్టేట్ కో–ఆర్డినేటర్లు, జిల్లా కో–ఆర్డినేటర్లతో బిందు సేద్యం ప్రగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులకు బిందు సేద్యం మంజూరు చేసి రాయితీలు అందిస్తామన్నారు. బిందు సేద్యంపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యమైన పంటలకు ఫెర్టిగేషన్ (బిందు సేద్యం ద్వారా ఎరువులు పండించే ప్రక్రియ)పై వీడియోలు రూపొందించి రైతులకు అవగాహన నిమిత్తం ప్రదర్శించాలన్నారు. ఏలూరు జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.రవికుమార్, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల పీడీలు, డ్రిప్ ఇరిగేషన్ కంపెనీల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మురిపించెన్

తొలిరోజు 85 శాతం పింఛన్ల పంపిణీ



భీమవరంలో ఐరిష్ తీసుకుంటున్న వలంటీర్

భీమవరం (ప్రకాశంచౌక్) : జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక బుధవారం వేకువజామున ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా 2,20,001 లబ్ధిదారులకు గాను 1,87,000 మందికి పింఛన్ మొత్తం అందించారు. మొత్తం రూ.60.01 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా రూ.51.02 కోట్లు అందజేశారు.

అత్యున్నత జీవితానికి దిశా నిర్దేశం

'సాక్షి–కేఎల్ విశ్వవిద్యాలయం' ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

పాలకొల్లు అర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యతను సాధిస్తేనే ఆయా రంగాల్లో రాణించేందుకు ఆస్కారం ఉంటుంది. విద్యార్థులకు ఇంటర్మీడియెట్ దశ కీలకం. ఇంటర్ తర్వాత విద్యార్థి ఎంచుకునే కోర్సు ఆధారంగా అవకాశాలు ఆహ్వానం పలుకుతాయి. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ విద్యలో అవకాశాలను తెలియజేసేందుకు 'సాక్షి–కేఎల్ విశ్వవిద్యాలయం' సంయుక్తంగా పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రోడ్డులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేఎల్ యూనివర్సిటీ ప్రతినిధులు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా అనర్థాలపై వివరించారు. ఇంజనీరింగ్ తర్వాత వచ్చే అవకాశాలు, లక్ష్యాల సాధన, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై సవిరంగా విశదీకరించారు.

విద్యార్థులకు బహుమతులు

సదస్సులో భాగంగా ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో అత్యున్నత మార్కులు సాధించిన పి.హిమజ, బి.హర్ష, కె.వర్ష, పి.తిమోతిరాజ్, వై.త్రివేణి, ఎం.మోక్షిత్‌కు కేఎల్ యూనివర్సిటీ తరపున బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ధూళిపాళ్ల ప్రసాదరావు అధ్యక్షత వహించారు. వర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ బొబ్బిలి సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ అండ్ పీఆర్ హెచ్ఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు



సదస్సుకు హాజరైన విద్యార్థులు

సాఫ్ట్‌వేర్‌లో రూ.లక్షల్లో జీతం



మంచి ప్యాకేజీ, ప్లేస్‌మెంట్‌లు చూపిస్తూ, మేధావులైన అధ్యాపకులతో విద్యాబోధన చేస్తూ, దేశంలోనే అత్యున్నత విద్యాప్రమాణాలను అందిస్తున్న విద్యాసంస్థగా కేఎల్ యూనివర్సిటీ గుర్తింపు పొందింది. ఏటా రూ.100 కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు అందిస్తూ ఎక్కువ మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్‌లు పొందే కళాశాలల్లో దేశంలో నాల్గో స్థానంలో నిలిచింది. కేఎల్ యూనివర్సిటీ నిర్వహించే ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థికి ఫీజులో రాయితీ, ఏడాది చదివిన తర్వాత బ్రాంచ్ మార్చుకునే, మేజర్ డిగ్రీతో మైనర్ డిగ్రీ పొందే, మంచి ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ పొందే అవకాశాలు ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో కేవలం రెండు గంటలు పనిచేస్తే లక్షల్లో జీతం పొందే వెసులుబాటు ఉంది. సాధారణ రైతు కుటుంబానికి చెందిన రావూరి పూజిత గూగుల్ సంస్థలో ఏడాదికి రూ.60 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం పొందడానికి చేసిన కృషిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని శ్రమించాలి. సోషల్ మీడియా విద్యార్థుల వ్యక్తిగత జీవితాన్ని బహిర్గతం చేస్తుంది. దీనికి దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల మంచి, చెడులు చూసే యువ ఇంజనీర్లను తయారు చేయడమే కేఎల్ యూనివర్సిటీ లక్ష్యం

– డాక్టర్ జె.శ్రీనివాసరావు, కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్

అనుమానాల నివృత్తి



అవగాహన సదస్సు వల్ల నా అనుమానాలు నివృత్తి అయ్యాయి. కోర్సుల ఎంపిక విషయం తెలిసింది. ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థికి సాధారణంగా చాలా అనుమానాలు ఉంటాయి. అలాగే కేఎల్ యూనివర్సిటీ గురించి కూడా తెలుసుకున్నాం.

–పులఖండం భవానీ, విద్యార్థిని

అన్ని విషయాలపై..



ఇంజనీరింగ్‌లో బ్రాంచ్‌ల ఎంపిక, బ్రాంచ్ మార్చుకునే విషయాలు తెలిశాయి. మల్టీ డిసిప్లేన్స్ ఇంజనీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలుసుకున్నాం. ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులకు ఈ సదస్సు బాగా ఉపయోగపడుతుంది.

–కాళ్లకూరి సంతోషి మేఘన, విద్యార్థిని

అవగాహన కలిగింది



కేఎల్ యూనివర్సిటీ సదస్సు ద్వారా అవగాహన కలిగింది. విద్యాలక్ష్మి పోర్టల్ వెబ్‌సైట్ గురించి తెలుసుకున్నాం. దీనిద్వారా మెరిట్ విద్యార్థులకు బ్యాంకు రుణం వస్తుందని చెప్పారు. ఇది విద్యార్థులకు ఎంతో విలువైన సమాచారం.

–పి.తిమోతిరాజ్, విద్యార్థి

నారసింహుడు పెండ్లి కొడుకాయెనే..

సుందరగిరిపై కల్యాణోత్సవాలు



పెండ్లి ముస్తాబు తంతు జరిపిస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న దత్తత ఆలయం ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై కొలువైన స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి పండితులు పెండ్లి ముస్తాబు చేశారు. ఆలయ ఈఓ త్రినాథరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, రుత్విగ్వరణ, అంకురార్పణ, కలశస్థాపన, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠాపన వేడుకలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఉత్సవాల్లో నేడు:

- ఉదయం 7 గంటల నుంచి.. నిత్య హోమాలు, మూలమంత్ర హవనాలు, బలిహరణ, వేద పారాయణ, ఔపోసన, మండప పూజలు, హారతి, మంత్ర పుష్పాల సమర్పణ.
- సాయంత్రం 6 గంటల నుంచి.. మూలమంత్ర హవనాలు, బలిహరణలు, హారతి, మంత్ర పుష్పాల సమర్పణ.
- సాంస్కృతిక కార్యక్రమం : త్రిరత్నాల నాటక ప్రదర్శన.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి


మృతుడు రాంబాబు

లింగపాలెం: లింగపాలెం మండలం తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన కె.రాంబాబు (34) ట్రాక్టర్ చెరువులో తిరగబడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ధర్మాజీగూడెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపాలెం పంచాయతీ తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన కె.రాంబాబు, సర్వేశ్వరావు అన్నదమ్ములు. రాంబాబు డ్రైవింగ్ చేస్తుండగా సర్వేశ్వరావు పక్కన కుర్చున్నాడు. తండ్రి ఇటీవల మృతి చెందడంతో పెదకర్మ బుధవారం జరగాల్సి ఉంది. దీంతో ఇద్దరూ మంగళవారం అర్ధ రాత్రి తోచలకరాయుడుపాలెం నుంచి ట్రాక్టర్ వేసుకుని మంచి నీళ్ల ట్యాంకర్ తీసుకొని ఇంటికి వస్తుండగా మధ్యలో కొత్తపల్లి పెదచెరువు వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. రాంబాబు మృతి చెందగా సర్వేశ్వరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్సకు ఏలూరు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెన్నారావు తెలిపారు.

ప్రకృతి వరం.. కొల్లేరు చిత్తడి

- నేడు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం
- తెలుగు రాష్ట్రాల్లో ఏకైక చిత్తడి నేల కొల్లేరు

కైకలూరు: తెలుగు రాష్ట్రాల్లో చిత్తడి నేలల ప్రాంతంగా గుర్తింపు పొందిన ఏకైక సరస్సు కొల్లేరు. ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 2న అంతర్జాతీయ చిత్తడి నేలల దినోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది చిత్తడి నేలల పునరుద్ధరణ నినాదంతో అవగాహన చేపడుతున్నారు. గతేడాది భారత్ నుంచి అంతర్జాతీయ రామ్‌సర్ జాబితాలో 16 చిత్తడి నేలలు చేరడంతో మొత్తం వీటి సంఖ్య 75కు చేరింది. దీంతో దక్షిణాసియాలో అత్యధిక రామ్‌సర్ సైట్స్ ఉన్న దేశంగా భారత్‌కు గౌరవం దక్కింది. వెట్‌ల్యాండ్ డే(చిత్తడి నేలలు) సందర్భంగా గురువారం కొల్లేరు ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారులు ప్రజలకు చిత్తడి నేలలపై అవగాహన కలిగించనున్నారు.

భూ ఉపరితలంలో ఏడాది పొడవునా ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండే భూములను చిత్తడి నేలలు అంటారు. ఇరాన్‌లోని కాస్పియన్ సముద్ర తీరాన ఉన్న రామ్‌సర్ ప్రాంతంలో 1971 ఫిబ్రవరి రెండున రామ్‌సర్ కన్వెన్షన్ ఏర్పడింది. ఇది యునిస్కో పర్యవేక్షణలో పని చేస్తోంది. ఇప్పటివరకు దీనిపై 172 దేశాలు ఒప్పంద సంతకం చేశాయి. చిత్తడి నేలల పరిరక్షణ, అంతర్జాతీయ సహకారం దీని లక్ష్యం. భారతదేశం 1982 ఫిబ్రవరి ఒకటిన రామ్‌సర్ కూటమిలో ఒప్పంద సంతకం చేసింది. చిత్తడి నేలలను ప్రకృతి, ప్రజలకు విలువైన వనరుగా భావించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాయి.


కొల్లేరులోని చిత్తడి నేలల ప్రాంతం

చిత్తడి నేలల నిలయం కొల్లేరు

ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా తొమ్మిది మండలాల పరిధిలో 122 గ్రామాల్లో కొల్లేరు సరస్సు 2 లక్షల 22 వేల 689 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. రామ్‌సర్ సైట్‌గా దీనిని 2002 ఆగస్టు 19న గుర్తించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కొల్లేరుకు మాత్రమే ఈ గౌరవం దక్కింది. కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం కావడంతో అనేక జీవరాశులకు ఇది ఆలవాలంగా నిలిచింది. ఇక్కడ మొత్తం 180 జాతుల విదేశీ, స్వదేశీ పక్షులు విహరిస్తున్నాయి. ప్రపంచంలో 40 శాతం పెలికాన్ పక్షులు కొల్లేరుకు విడిది రావడానికి చిత్తడి నేలలే కారణం. ముఖ్యంగా ఇక్కడ నేల సారవంతంగా ఉండటంతో దేశంలోనే అత్యధిక ఆక్వా ఉత్పత్తులు అందించే ప్రాంతంగా కొల్లేరు రికార్డులు నెలకొల్పుతోంది.

చిత్తడి నేలల ఉపయోగాలు..

- చిత్తడి నేలలు వరదలను నియంత్రిస్తాయి.
- ఫిల్టర్ మాదిరిగా నీటిని శుద్ధి చేస్తాయి. అందుకే వీటిని ప్రకృతి మూత్రపిండాలు అంటారు.
- మట్టిలో ఉన్న ఉత్పాదక సారాన్ని పెంచుతాయి.
- ఔషధ గుణాలున్న మొక్కల పెరుగుదలకు తోడ్పడతాయి.
- అత్యధిక జీవరాశులకు ప్రధాన ఆవాస కేంద్రం
- ఇతర భూభాగాలతో పోలిస్తే చిత్తడి నేలలు జీవశాస్త్రపరంగా వైవిధ్యమైనవి.
- వాతావరణ మార్పులను నియంత్రిస్తాయి.

భారతదేశంలో చిత్తడి నేలల సంఖ్య - 75
దేశంలో చిత్తడి నేలల విస్తీర్ణం - 33,16,695 ఎకరాలు
దేశంలో చిత్తడి నేలల విస్తీర్ణత శాతం - 4.63

పుడమికి మూత్రపిండాలు.. చిత్తడి నేలలు

ఆరోగ్యకరమైన చిత్తడి నేలలు స్పాంజ్‌ల మాదిరిగా పనిచేస్తాయి. నీటిలో మిథైన్ అనే విష వాయువులను లోపలికి సంగ్రహించి స్వచ్ఛమైన నీటిని చిత్తడి నేలలు పైకి పంపుతాయి. ప్రపంచంలో 40 శాతం జీవరాశులకు చిత్తడి నేలలు ఆశ్రయం కల్పిస్తున్నాయి. లోతట్టు, తీర, మానవ నిర్మిత చిత్తడి నేలలు అనే మూడు రకాలుగా ఇవి ఉంటాయి. సరస్సులు, మడ అడవులు, పగడపు దిబ్బలు, ఉప్పు చిప్పలు, వరద మైదానాలను చిత్తడి నేలలుగా పరిగణిస్తారు. అడవిలో ఒక హెక్టారు పరిధిలో జీవరాశులకు ఒక శాతం మేర ఉపయోగం ఉంటే అదే చిత్తడి నేలల్లో హెక్టారుకు ఆరు శాతం జీవరాశులకు ప్రయోజనం కలుగుతుంది.

చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యత



చిత్తడి నేలలు జీవరాశులన్నింటికీ అనుకూలంగా ఉంటాయి. వీటిని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. వరల్డ్ వైడ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో చిత్తడి నేలల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తున్నాం. తెలుగు రాష్ట్రాల నుంచి 36 ప్రాంతాలను రామ్‌సర్ సైట్‌లుగా గుర్తించాలని పంపాం. అందులో పులికాట్ సరస్సు కూడా ఉంది. మరిన్ని వెట్ ల్యాండ్‌లు గుర్తింపు పొందాలి.

– ఫరిదా టంపల్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్, స్టేట్ డైరెక్టర్, హైదరాబాద్

అవగాహన కల్పిస్తున్నాం..



అటవీ శాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలల ఆవశ్యకతను ప్రజలందరికీ వివరిస్తున్నాం. చిత్తడి నేలల కారణంగా లక్షలాది కిలోమీటర్ల నుంచి విదేశీ పక్షులు కొల్లేరు ప్రాంతానికి విడిదికి వస్తున్నాయి. అడవుల కంటే మూడు రెట్లు వేగంగా చిత్తడి నేలలను కోల్పోతున్నాం. చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలి.

– ఎస్‌వీఎస్ కుమార్, అటవీ శాఖ రేంజర్, ఏలూరు

హత్య కేసు మిస్టరీ గుట్టురట్టు


హత్యకు గురైన పొట్ల నాగమణి(ఫైల్)

చింతలపూడి: చింతలపూడిలో మహిళ మిస్సింగ్ కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మహిళను హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ కేసు వివరాలు వెల్లడించారు. చింతలపూడి ఎస్‌బీఐ నగర్‌కు చెందిన పొట్ల నాగమణి(37) భర్త చనిపోవడంతో ఇద్దరు కుమార్తెలతో పాటు అత్త , మామలతో కలిసి ఉంటుంది. ఖమ్మం జిల్లా గంగారం గ్రామంలో స్థలం విషయంలో వైరాకు చెందిన నంబూరి శ్రీనివాసరావుతో ఆమెకు పాత గొడవలు ఉన్నాయి. మృతురాలు 2016లో ఇదే స్థల వివాదంలో సివిల్ కోర్టులో పిటిషన్ వేసింది. మూడు సంవత్సరాల క్రితం చింతలపూడి మండలం , ఎండపల్లి గ్రామానికి చెందిన బర్రె రాంబాబు నాగమణికి పరిచయమయ్యాడు. తనకు తెలిసిన పెద్దలతో మాట్లాడి స్థలం వివాదం పరిష్కరిస్తానని నమ్మబలికాడు. అనంతరం నాగమణితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. స్థల వివాదం పరిష్కరించాలని నాగమణి పట్టుబట్టడంతో రాంబాబు శ్రీనివాసరావును కలిశాడు. నాగమణిని అడ్డు తప్పిస్తే ఉన్న స్థలంలో 6 కుంట్లతో పాటు రెండు లక్షల నగదు ఇస్తానని శ్రీనివాసరావు చెప్పడంతో రాంబాబు అంగీకరించాడు. దీంతో ఇద్దరూ పథకం ప్రకారం నాగమణిని అడ్డు తప్పించాలనుకున్నారు. గత నెల 19న రాంబాబు కారులో కాకినాడ సర్పవరం జంక్షన్‌లో ఉన్న శ్రీనివాస లాడ్జికి నాగమణిని తీసుకెళ్ళాడు. అదే రోజు రాత్రి కారు జాకీ రాడ్‌తో తలపై కొట్టి చీర చెంగుతో మెడకి గట్టిగా బిగించి హత్య చేశాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలు చేతికి ఉన్న బ్రాస్‌లెట్లు తీసుకున్నాడు. లాడ్జికి దగ్గరలో ఉన్న ఎరువుల దుకాణంలో పెట్రోలు డబ్బా, ఎరువుల సంచి కొని మృతదేహాన్ని మూటకట్టి కారులో వేసి 21వ తేదీ తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్రం దమ్మపేట మండలం ఆర్లపెంట గ్రామ శివారులోని డంపింగ్ యార్డు వద్ద పెట్రోల్ పోసి నాగమణి మృతదేహాన్ని తగలబెట్టాడు.అనంతరం మృతురాలి సోదరుడితో కలిసి చింతలపూడిపోలీసులకు నాగమణి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. రాంబాబుపై అనుమానం వచ్చి విచారించగా పోలీసులకు దొరకకుండా తప్పించుకున్నారు. సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు తన సిబ్బందితో రాంబాబుతో పాటు నంబూరి శ్రీనివాసరావును పట్టుకుని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

గడపగడపకు సంక్షేమం


ఆకివీడు: నగర పంచాయతీలోని 5వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల్ని వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో క్షతగాత్రుడికి సపర్యలు చేస్తున్న స్థానికుడు

ద్వారకాతిరుమల: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కొమ్మర-కోడిగూడెం మధ్య ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కోడిగూడెంకు చెందిన మానుకొండ రాజేష్ ద్వారకాతిరుమల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. అదే సమయంలో గోపాలపురం మండలం చిట్యాలపాడుకు చెందిన కోడూరి సుబ్రహ్మణ్యం కోడిగూడెం వైపు నుంచి ద్వారకాతిరుమల వైపుకు బైక్‌పై వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి వీరి వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన రాజేష్, సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉచిత న్యాయ సహాయంపై అవగాహన


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): ఏదైనా నేరం మోపితే ముందుగా సంబంధిత వ్యక్తులకు లేదా వారి కుటుంబ సభ్యులకు కేసు వివరాలను తెలియజేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. స్థానిక శనివారపుపేట సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యక్తుల అరెస్టుకు ముందుగా కూడా లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని ఈ విషయాన్ని ప్రజల వద్దకు తీసుకుని వెళ్లాలని చెప్పారు. ఈ నెల 11న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కోర్టులున్న అన్ని ప్రదేశాలలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అర్హులైన కేసులలో బాధితులకు నష్టపరిహారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ జీవీ భాస్కర్, సీడబ్ల్యూసీ సభ్యులు పుచ్చల వెంకట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్


గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న నిందితులను అరెస్టు చేసిన ఎస్ఈబీ అధికారులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): గంజాయి తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మణికంఠ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావుకు అందిన సమాచారం మేరకు గత నెల 31న జీలుగుమిల్లి మండలం తాటియాకుల గూడెం వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో తమిళనాడుకు చెందిన నడేసన్ రాజేంద్ర, మిచెల్ మహాలక్ష్మి, మురుగస్ ప్రేమలత, మరి ప్రియాంకలు 24 కేజీల గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి రవాణా చేస్తున్నట్లు ఒప్పుకోవడంతో పాటు, వారికి సహకరించిన మరో ఇద్దరి పేర్లు కూడా తెలిపారన్నారు. ఆ ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందని మణికంఠరెడ్డి తెలిపారు. నిందితుల నుంచి 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు సెల్‌ఫోన్‌లు, బస్‌టిక్కెట్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రియుడి సాయంతో భర్త హత్య!


మృతుడు రాటాలు(ఫైల్)


ముసునూరు: ఇసుక తోలడానికి వెళ్ళిన వ్యక్తి అదృశ్యమవడం, అనంతరం హత్యకు గురవడం సంచలనం సృష్టించింది. మండలంలోని యల్లాపురానికి చెందిన రాయనపాటి రాటాలు(కాశి)(36) జనవరి 3న తన వ్యానులో ఇసుక లోడు చేసి రమణక్కపేటలో విక్రయానికి వెళ్తున్నానని చెప్పాడు. తెల్లారినా ఇంటికి రాకపోవడంతో తండ్రి సత్యనారాయణ ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు అనుమానితులను విచారించగా.. అతనిని హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని సమాచారం. వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని మృతుని భార్య ప్రియుడితో కలసి హత్య చేయించినట్లు వెల్లడైంది. అదృశ్యమైన రోజు రాత్రి రమణక్కపేట నుంచి తిరిగి వస్తున్న మృతుడు రాటాలును అతని భార్య, ప్రియుడు, మరో ముగ్గురు కలసి సూరేపల్లి మామిడి తోటలో హత్య చేసి, లోపూడి అడవిలో దహనం చేశారు. అనంతరం మళ్లీ వెళ్ళి చూడగా శవం పూర్తిగా కాలలేదని గుర్తించారు. దీంతో తన వ్యానులో వేసుకుని యల్లాపురం గ్రామంలోని తమ్మిలేరులో పాతిపెట్టినట్లు సమాచారం.

ఖైదీల్లో పరివర్తనకు శిక్షణ


ఏలూరు జిల్లా జైలులో ఖైదీలకు అందించే సరుకులను పరిశీలిస్తోన్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా కారాగారంలో భద్రతాపరమైన అంశాలను ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ తనిఖీ చేశారు. బుధవారం ఉదయం జిల్లా జైలుకు వెళ్ళిన ఎస్పీ రిమాండ్ ఖైదీలు, శిక్షలు పడిన ఖైదీలను అందుతున్న సౌకర్యాలు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందించే సరుకులను, వాటి నాణ్యతను ఆరా తీశారు. సీసీ కెమెరాల పనితీరును, కమ్యూనికేషన్ సిస్టమ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఖైదీల్లో పరివర్తన తెచ్చేందుకు ప్రత్యేకంగా మోటివేషన్ క్లాసులు తీసుకోవాలని సూచించారు. జిల్లా జైలు గోడలను ఎత్తు పెంచాలని ఆదేశించారు. అధికారులు ఖైదీల విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ సరైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. సమీక్షలో జైలు సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి, జైలర్లు కే.వెంకటరెడ్డి, ఎం.అప్పలనాయుడు, కే.శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


మృతుడు మామిడిశెట్టి గంగాధరరావు(ఫైల్)

ఇరగవరం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలోని తూర్పువిప్పర్రు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మామిడిశెట్టి గంగాధరరావు(65) మంగళవారం సాయంత్రం నారాయణపురంలోని మైగాపు రత్తమ్మ తల్లి గుడికి వెళ్ళి వస్తుండగా.. పెరవలి నుంచి మార్టేరు వైపు వెళుతున్న గుడాల రాజు (27) బైక్ ఢీ కొట్టింది. దీంతో గంగాధరరావును తణుకు గవర్నమెంటు ఆసుపత్రికి, నాగరాజును ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రాజు బైక్ వెనుక కూర్చున్న వ్యక్తికి గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాలకు తణుకు ఏరియా ఆసుపత్రిలో పంచనామా నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న పి.గంగాధర్(26)ను టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో తల నుజ్జు, నుజ్జయ్యింది. మృతుడు ఒక టిప్‌టాప్ కంపెనీలో పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొట్టిన రోడ్ రోలర్


శ్రీవారి కొండపై చెట్టును ఢీకొట్టి నిలిచిన రోడ్‌రోలర్

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై బ్రేక్‌లు ఫెయిలైన ఒక రోడ్డు రోలర్ చెట్టును ఢీకొట్టింది. ఆ సమయంలో అటుగా భక్తులెవరూ రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం. కొండపైన శివాలయం వద్ద బుధవారం ఉదయం రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ సమయంలో రోడ్‌రోలర్‌కు బ్రేక్‌లు ఫెయిలవడంతో అది అకస్మాత్తుగా ముందుకు దూసుకెళ్లి, రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి నిలిచిపోయింది. నిత్యం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఆ ప్రాంతంలో ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

క్లుప్తంగా

ముత్యాలమ్మ వెండి చీరకు అరకిలో వెండి బహూకరణ



ముత్యాలంబపురం శ్రీముత్యాలమ్మవారి చీర నిమిత్తం అరకిలో వెండిని అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మవారి వెండి చీర నిమిత్తం అర కిలో వెండిని సవిత్రుపేటకు చెందిన మురపాక గణపతిరావు – వెంకటరమణ దంపతులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్య నిర్వహణాధికారి పి.హరేరామ్‌ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన పేరిచర్లకు అభినందనలు



బెస్ట్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా తాడేపల్లిగూడెంనకు చెందిన పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఎంపికయ్యారు. తణుకులో లయన్స్ క్లబ్ ప్రాంగణంలో అవార్డుల ఫంక్షన్ జరగగా 65 క్లబ్‌లు ప్రతినిధులు హాజరయ్యారు. తాడేపల్లిగూడెం డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంవత్సరకాలంలో పేరిచర్ల 727 సేవా కార్యక్రమాలు, 25 నూతన సభ్యత్వాలు, 1 లక్ష మందికి సహకారం అందించిన క్లబ్‌గా 5 విభాగాల్లో స్పెషల్ జ్యూరీ అవార్డులు దక్కాయి. ఈ అవార్డులు అందుకున్న పేరిచర్ల మురళీకృష్ణంరాజును పట్టణ ప్రముఖులు, లయన్స్‌క్లబ్ సభ్యులు, తదితరులు అభినందనలు తెలిపారు.

గ్లోబల్ సేవలు అభినందనీయం



మహిళకుసాయం అందజేస్తున్న చెన్నా జనార్ధన్ దంపతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నా త్రి కళ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదాయం మార్గం లేక ఇరువురు ఒంటరి మహిళలు, వారి పిల్లలు ఇబ్బందులు పడుతూ గ్లోబల్ సపోర్ట్ ఫౌండర్ చెన్నా త్రి కళను ఆశ్రయించారు. దీంతో స్పందించిన త్రి కళ దాతలు వెంకట రమణారెడ్డి, వాణిల సహాయంతో బుధవారం ఇరువురు మహిళలకు, వారి పిల్లలకు రూ 40,500 సాయంగా అందజేశారు. గ్లోబల్ సపోర్ట్ తరుపున చెన్నా జనార్దన్, సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాధవరంలో శ్రీ కృష్ణుడి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన



కృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మండలంలో మాధవరం గ్రామంలో బుధవారం శ్రీ కృష్ణ యాదవ సంఘం వారిచే నూతనంగా శ్రీ కృష్ణుడి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ్ సంఘం నాయకులు నీలపాల దినేష్ యాదవ్, బొద్దాని శ్రీనివాస్, కె.బాలకృష్ణ, పి.సురేష్, బి.రామకృష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ పరమాత్మకు లక్ష తులసి పూజ




ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణపరమాత్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): భీష్మ ఏకాదశి పురస్కరించుకుని స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీ కృష్ణ యోగ ధ్యాన మందిరంలో బుధవారం శ్రీకృష్ణ పరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. స్వామి వారికి నూతన పట్టు వస్త్రాలు అలంకరణ చేశారు. భక్తులచే లక్ష తులసి పూజ నిర్వహించారు. పూజలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహనరాజు పర్యవేక్షించారు.

వైభవంగా కేశవస్వామి కల్యాణం

స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



తణుకులో పూజలందుకున్న శ్రీకేశవస్వామి



తణుకులో కేశవస్వామి ఆలయంలో వద్ద క్యూలో ఉన్న భక్తులు



తాడేపల్లిగూడెంలో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: పట్టణంలో శ్రీకేశవస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి మహోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి 2.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకేశవస్వామి దివ్య తిరు కల్యాణ ఘట్టం వేద పండితుల వేద మంత్రోచ్చరణముల మధ్య వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామివారి దివ్య దర్శనానికి భక్తులు పోటెత్తారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు క్యూలైన్‌లో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. క్యూలైన్‌లోఉన్న భక్తులకు తాగునీరు సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం రథోత్సవం నిర్వహించి భారీ అన్నసమారాధన జరిపారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ మేనేజరు ముత్యాల సత్యనారాయణ, ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సభ్యులు పూజాధికాలను పర్యవేక్షించారు.

అంగరంగ వైభవంగా వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన నూతన కల్యాణ మండపంలో బుధవారం ద్వారకా తిరుమల నుంచి రథంలో తీసుకువచ్చిన వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు ఆలయ వేద పండితులతో అంగరంగ వైభవంగా కల్యాణాన్ని జరిపించారు. ముందుగా ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి కల్యాణం, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, కల్యాణపు అంక్షితులు అందజేశారు. స్వామి వారి అన్న ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కరరావు మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు కల్యాణ మండపాన్ని సందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నియోజకవర్గ, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కల్యాణ మండపంలో వివాహాలు జరిపించడంతో పాటు బలుసులమ్మ దర్శన భాగ్యం కలుగుతుందని, అమ్మవారి ఆశీస్సులు దంపతులకు మెండుగా ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుండుబోగుల నాగు, వట్టిప్రోలు రాము, ముప్పిడి సంపత్ కుమార్, ముత్యాల ఆంజనేయులు, కొలుకులూరి ధర్మరాజు, రాజా త్రినాద్, పెదప్రోలు భాస్కర్, వెలనాటి సత్తిబాబు, చింతకాయల సత్యనారాయణ, వట్టి బుజ్జి, సుచిత్ర రెడ్డి, కోడే అప్పన్న, కర్రి సుధాకర్ రెడ్డి, బెజవాడ రాంబాబు, స్పోర్ట్స్ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుండుబోగుల వెంకట రమణ, దాసరి హైమవతి, పాలకోడేటి సురేష్, శాంత్‌కుమార్ తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి జగనన్న ఇళ్లు పూర్తి చేసుకోవాలి



జగనన్న కాలనీలో లబ్ధిదారులకు కిటికీలు, అందిస్తున్న ఎంపీపీ హైమావతి

పెంటపాడు: ఉగాది నాటికి జగనన్న ఆశయాల మేరకు రాష్ట్రంలో 5 లక్షల ఇళ్లు పూర్తి చేసుకోవాలన్న లక్ష్యంలో భాగంగా మండలంలో లబ్ధిదారులు ఇళ్లు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. పెంటపాడు మండలంలో నవరత్నాలు– పేదలకు ఇళ్లు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు కిటికీలు, గుమ్మాలు అందించే కార్యక్రమం చేపట్టారు. పెంటపాడు మండలంలోని మౌంజీపాడులో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉగాది నాటికి 5లక్షల ఇళ్లు పూర్తి చేసుకోవాలనే లక్ష్యంలో భాగంగా గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని త్వరితగతిన గృహాలు పూర్తి చేసుకోవాలన్నారు. దీంతో పాటు, అన్ని సౌకర్యాలు ఉన్న కాలనీలలోకి గృహప్రవేశాలు చేసుకోవాలన్నారు. గ్రౌండింగ్ కాని ఇళ్లు పూర్తి చేసుకొనేలా లబ్ధిదారులకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదరరావు, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, పంచాయతీ రాజ్ ఏఈ ఉన్నమట్ల నవీన్, ఈవోపీఆర్డీ ప్రసాద్, మౌంజీపాడు ఎంపీటీసీ సభ్యులు వెంకన్నబాబు, గొన్నూరి శ్రీనివాస్, హౌసింగ్ వర్కు ఇనస్పెక్టర్‌లు కె. జయరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

200 మంది విద్యార్థులకు అల్పాహారం అందజేత



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారిచే పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమారు 200 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు పూర్తి అయ్యే వరకు సాయంత్రం నిర్వహించే ప్రత్యేక క్లాస్‌లు నిమిత్తం అల్పాహారం ఏర్పాటు చేశారు. స్కూల్‌లో బుధవారం దాతలు పదం కుమార్ గుప్తాచే రోజు రూ. 4 వేలు విలువైన అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రెండు నెలలకు సుమారు రూ 2 లక్షల విలువైన అల్పాహారం విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. మధురాన్నం సొసైటీ వారిచే 250 ప్లేట్లు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణ మూర్తి, వంగపండు రామ్మోహన్ రావు, పేరూరి కాశయ్య, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, మదన్మోహన్ అగర్వాల్, పచ్చా వెంకటేశ్వరరావు, పడాల మహేశ్వరరావు, పేరూరి సుబ్బారావు, సొలస ప్రసాద్, అఖిల్, హెచ్ఎం ఏఎస్ఆర్ మూర్తి, ఎన్‌సీసీ అధికారి కేవీ గణపతిరావు, పి.శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌ఫిలిం పోస్టరు ఆవిష్కరణ



మౌనసమీరం పోస్టరును ఆవిష్కరిస్తున్న గుండుబోగుల నాగు తదితరులు

తాడేపల్లిగూడెం అర్బన్: సమాజంలో మార్పులు తీసుకువచ్చేది నాటకాలు, సినిమాలేనని వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు గుండుబోగుల నాగు అన్నారు. స్థానిక బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద 'మౌనసమీరం' లఘుచిత్రం పోస్టర్లను ఏఎంసీ చైర్మన్ గుండుబోగులు వెంకటరమణతో కలిసి ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం లఘుచిత్రాల హవా నడుస్తుందన్నారు. లఘుచిత్రాల ద్వారా ఎంతో మంది యువనటులు తమ ప్రతిభను చూపుతున్నారని చెప్పారు. యువ నటులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో మౌనసమీరం లఘుచిత్రానికి తాను నిర్మాతగా వ్యవహరించినట్లు తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు సానబోయిన జగదీష్, వట్టిప్రోలు రాము, అప్పన రమేష్, వానపల్లి ప్రసాద్, నున్న రంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వినియోగంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

తణుకు టౌన్: ఎరువులు, పురుగు మందుల షాపుల డీలర్లు వ్యవసాయంలోని వివిధ పథకాలు, ఎరువుల యాజమాన్యం, పురుగుల వినియోగానికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన 48 వారాల కోర్సును పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు చెప్పారు. బుధవారం తణుకు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో తణుకు, కొవ్వూరు, తాడేపల్లిగూడెం, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన ఎరువులు, పురుగు మందుల షాపుల డీలర్లకు దేశీ కోర్సుకు సంబంధించి నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకోర్సులో నమోదైన డీలర్లకు వ్యవసాయ శాఖలోని వివిధ పథకాలు గురించి వివరిస్తారని చెప్పారు. ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల వినియోగం, వాటి ప్రభావం వంటి అంశాలతో పాటు నిషేధిత పురుగు మందులపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈకోర్సును ప్రతి ఆదివారం తేతలి రైతు భరోసా కేంద్రంలో శిక్షణా తరగతులను నిర్వహిస్తారని తెలిపారు. 48 వారాల పాటు జరిగే ఈశిక్షణా కార్యక్రమాలను డీలర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆత్మ డీపీడీ మాదవీలత, రిటైర్డ్ ఏడీఏ శ్రీనివాసు, ఏవోలు కే కుసుమ, ఎం బాబూరావు, ఏఈవో టీ వీరభద్రుడు, ఆయా మండలాలకు చెందిన ఎరువులు, పురుగు మందుల డీలర్లు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పారదర్శకంగా చేపట్టాలి



అత్తిలిలో ప్రజా వేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాజేశ్వరరావు

అత్తిలి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనులు పారదర్శకంగా ఉండాలని డ్వామా పీడీ ఎస్టీవీ రాజేశ్వరరావు చెప్పారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులకు సంబంధించి ఇటీవల నిర్వహించిన సోషల్ ఆడిట్‌పై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. అత్తిలి మండలంలోగల 18 గ్రామాల్లో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, స్వయం సహాయక పథకాలకు సంబంధించి దుర్వినియోగం అయిన రూ. 11,15,359లు రికవరీ చేయాలని డ్వామా పీడీ సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. 606 పనులకు డాక్యుమెంట్లు సమర్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, ఎంపీడీవో వీవీఎస్ రామారావు, డ్వామా అధికారి బి వీరాస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి విరాళం



ఆలయానికి విరాళం అందజేస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీష్మ ఏకాదశి సందర్భంగా హౌసింగ్ బోర్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వేకువ జామున స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం పఠించారు. స్వామివారి శాశ్వత నిత్యపూజా పథకానికి పి.అర్జున్ రాజు దంపతులు రూ.25 వేలు, కర్మూరి ప్రవీణ రూ.25 వేలు విరాళం అందజేశారు. వీరికి ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు రసీదులను అందించారు. దాతలకు అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసచార్యులు వేద ఆశీర్వచనం పలికి స్వామివారి శేషవస్త్రం అందించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు స్వామివారి శేష వస్త్రం రసీదులను అందించారు. కార్యదర్శి కుక్కల బాల వెంకటరత్నం, సరిపిడకల రామారావు, జానపాటి మధు ఉన్నారు.

రైతాంగాన్ని నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రైతాంగాన్ని, మధ్యతరగతి ప్రజానీకాన్ని తీవ్ర నిరాశకు గురి చేసిందని, వ్యవసాయ రంగానికి నిధుల్లో కోతపెట్టి మొండి చెయ్యి చూపిందని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు విమర్శించారు. పట్టణంలో కేంద్ర బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి ఆ ధరలకు చట్టబద్ధత కల్పించడం వంటి చర్యలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదన లేకపోవడం అన్యాయమన్నారు. ఢిల్లీలో రైతాంగ ఉద్యమ ఫలితంగా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకోస్తామని చెప్పి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి ఎటువంటి మేలు చేయలేదని తెలిపారు. సన్న, చిన్నకారు రైతులు, పేద రైతులు, కౌలు రైతుల సంక్షేమానికి ఎటువంటి కేటాయింపులు లేవని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం లేదని, విద్య, ఆరోగ్యంపై బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. సంపన్నుల ప్రయోజనాలను కాపాడే బడ్జెట్‌గా ఉందని వివరించారు.

జనరంజకంగా కేంద్ర బడ్జెట్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ జనరంజకంగా ఉందని బీజేపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బడ్జెట్ మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉందని తెలిపారు. ఇన్‌కంట్యాక్స్‌లో రూ.7 లక్షల ఆదాయం వచ్చే వారికి ఫ్రీ టాక్స్ చేశారని, ఈ విధానం ఉద్యోగులకు, మధ్యతరగతి వారికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. గతంలో కంటే రైల్వే రంగంలో 9 రెట్లు అధికంగా నిధులు కేటాయించారని తెలిపారు. రైతులకు 20 లక్షల కోట్లు రుణ సదుపాయం కల్పించడం జరిగిందని వివిధ స్కీంలు ప్రవేశపెట్ట డం ద్వారా రానున్న రోజుల్లో దేశం ఆర్థికంగా ఎంతో బలపడుతోందని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు అభినందనలు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

సాక్షి, భీమవరం: విద్యార్థులు చెడు అలవాట్లను దరి చేరనీయవద్దని అమెరికాలోని ఇంగల్లాస్ మెమోరియల్ యూనివర్సిటీ ఆఫ్ షికాగో మెడికల్ సెంటర్ ఫ్యామిలీ మెడిసిన్ ఎండీ డాక్టర్ జి.గణపతిరాజు అన్నారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జనరల్ మెడిసిన్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని వివరించారు. ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ పార్లమెంట్‌లో పెట్టొద్దు



ఒక రోజు దీక్షలో పాల్గొన్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టొద్దు అంటూ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణం తాలూకా ఆఫీస్ సెంటర్‌లో బుధవారం ఒక రోజు నిరాహార దీక్ష నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లుపై ముద్రించాలని, ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ లకు రిజర్వేషన్లు కల్పించాలని, రాజ్యాంగ దినోత్సవం రోజున అంబేడ్కర్ ఫొటోను పెట్టి జెండా వందనం చేయాలని, రాజ్యసభ, శాసన మండలిలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దంకి ఆనందరావు, డి.వెంకట రమణ, సుంకర ప్రి బాబు, యూ.ఏసురత్నం, వి.సునీల్, అనిల్, రాజు, ప్రేమ కుమార్, అచ్చిబాబు, మురళి, ఎలీషా, నాగేశ్వరరావు, చిట్టిబాబు, సుజ్ఞాన్ తదితరులు దీక్షలలో కూర్చున్నారు. మాలమహానాడు సభ్యులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



అత్తిలి మండలం శివపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అత్తిలి: టెన్త్ పరీక్షలు సమీపిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పైప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్ సీఎం దత్ చెప్పారు. బుధవారం అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆధ్వర్యంలో తిరుపతిపురం శివారు శివపురం గ్రామంలో 'ఇంటింట సందర్శన' కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల చదువు సామర్థ్యాలు ఎలా ఉన్నాయో వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. టెన్త్ పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో తమ పిల్లలు ప్రణాళికా బద్ధకంగా చదువుకునేలా చూడాలన్నారు. ఇదే సందర్భంలో బడి పిలుస్తోంది పేరుతో రాబోవు విద్యా సంవత్సరంలో ఇతర పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ఇంటింటా తిరిగారు. తమ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు, జగనన్న విద్యాకానుక పథకంలో భాగంగా ప్రభుత్వం కల్పించే ఉచిత సదుపాయాలు గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈసందర్భంగా తమ పిల్లలను పాఠశాలలో చేర్పడానికి తల్లిదండ్రులు ఆశక్తి చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి



అత్తిలిలో డ్వామా పీడీ రాజేశ్వరరావుకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు తేలి శాంతిస్వరూప్ డ్వామా పీడీ ఎస్టీవీ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేసారు. బుధవారం అత్తిలికి విచ్చేసిన డ్వామా పీడీని వీరు కలుసుకుని మొబైల్ సౌకర్యం కల్పించాలని, పనిభారం తగ్గించాలని, ఎన్ఐసీ యాప్ ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా శాంతిస్వరూప్ మాట్లాడుతూ జిల్లాలో కరోనాతో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంలో జాప్యం జరిగిందని, దీనివల్ల ఫీల్డ్ అసిస్టెంట్లు నష్టపోయారని, వారికి న్యాయం చేయాలన్నారు. మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పనిదినాల టార్గెట్‌ను రద్దుచేయాలని, మండల స్థాయి బదిలీలు, ప్రమోషన్లు తదితర డిమాండ్లపై ఫీల్డ్ అసిస్టెంట్లు పీడీ రాజేశ్వరరావుకి వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె రమేష్, మహేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పిల్లి ఏసురత్నం, శివరామకోటి, సూర్య, ఆదిలక్ష్మి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛసంకల్పం సమర్థవంతంగా నిర్వహించాలి

పెంటపాడు: జగనన్న స్వచ్ఛ సంకల్పం సమర్థవంతంగా నిర్వహించాలని పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు . గత వారం రోజుల నుంచి పెంటపాడు 1వ వార్డు, శివాలయం ప్రాంతంలో జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమం పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్నారు. ఈ పనిలో భాగంగా నిత్యం ఉదయాన్నే రోడ్లు ఊడ్చటం, డ్రైనేజీలలో పేరుకున్న చెత్తను తీయడం, చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించడం వంటి పనులు కార్యదర్శి అనిల్ కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది చేపడుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యకళ బుధవారం పాల్గొని సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి విజయానంద రెడ్డి, యూత్ అధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు కొలుపూరి శివకిరణ్, చదలవాడ శ్రీనివాస్ ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల బాబి నాగమణి, గ్రామ వలంటీర్లు, 1వ వార్డు సభ్యులు కాసారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మట్టి లారీల సీజ్

కాళ్ల: కృష్ణా జిల్లా నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా పెద్ద ఎత్తున మట్టి తరలిస్తున్న టిప్పర్ లారీలను సీజ్ చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. మండలంలో పెద్ద ఎత్తున మట్టి వ్యాపారం సాగుతుంది. ఆకివీడు సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అక్రమంగా బొండు ఇసుక తరలిస్తున్న 8 టిప్పర్ లారీలను సీజ్ చేశామన్నారు.

అండర్-19 ప్రపంచకప్ విజేత జట్టుకు బీసీసీఐ సన్మానం

ఐసీసీ తొలిసారి నిర్వహించిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా సభ్యులను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం అహ్మదాబాద్‌లో ఘనంగా సన్మానించింది. న్యూజిలాండ్‌తో ఆఖరి టి20 పోరుకు ముందు జరిగిన ఈ వేడుకలో బోర్డు ప్రకటించిన రూ. 5 కోట్ల నజరానాను భారత దిగ్గజం సచిన్ చేతుల మీదుగా అండర్-19 జట్టు కెప్టెన్ షఫాలీ వర్మ అందుకుంది. అమ్మాయిలు అద్భుతంగా రాణించారని కితాబిచ్చిన 'మాస్టర్'... ఈ ఘనతతో మరెంతో మంది మహిళా క్రికెటర్ల కలలకు ఊపిరి పోశారని అన్నారు.



గిల్ జిగేల్...


గిల్

- భారత ఓపెనర్ మెరుపు సెంచరీ
- ఆఖరి టి20 పోరులో టీమిండియా 168 పరుగులతో విజయం
- కివీస్‌పై 2-1తో సిరీస్ సొంతం

అహ్మదాబాద్: మోదీ స్టేడియంలో భారత్ పరుగుల మోత మోగించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (63 బంతుల్లో 126 నాటౌట్; 12 ఫోర్లు, 7 సిక్సర్లు) తన బ్యాటింగ్ సునామీని చూపించాడు. దీంతో ఆఖరి టి20లో టీమిండియా 168 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి 2-1తో సిరీస్ గెలుచుకుంది. మొదట భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. రాహుల్ త్రిపాఠి (22 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిపించాడు. అనంతరం న్యూజిలాండ్ 12.1 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' హార్దిక్ పాండ్యా నాలుగు వికెట్లు తీశాడు.

గిల్ విధ్వంసం

ఇషాన్ కిషన్ (1) రెండో ఓవర్లోనే నిష్క్రమించగా... గిల్, త్రిపాఠి కివీస్ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగారు. రెండో వికెట్‌కు ఈ జోడీ మెరుపులతో 7 ఓవర్ల వ్యవధిలోనే భారత్ 80 పరుగులు చేసింది. తర్వాత సూర్యకుమార్ (13 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్సర్లు) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా క్రీజులోకి రాగా... 15 ఓవర్లలో భారత్ స్కోరు 156/3. శుబ్‌మన్ 44 బంతుల్లో 67 పరుగులతో ఉన్నాడు. గిల్ అప్పటిదాకా ఒక ఆట, 16వ ఓవర్ నుంచి మరో ఆట ఆడాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన గిల్... లిస్టర్, టిక్నర్, ఫెర్గూసన్ ఎలా ఎవరెదురైనా... బంతుల్ని అదేపనిగా బౌండరీ దాటించాడు. పాండ్యా ఆడిన బంతుల్ని మినహాయిస్తే... గిల్ 16 బంతులను వరుసగా 0, 6, 6, 1, 6, 4, 0, 6, 1, 4, 6, 1, 4, 1, 4, 6లుగా ధనాదంచేశాడు. దీంతో 4 ఓవర్లలోనే భారత్ 72 పరుగులు చేసింది. ఇందులో 56 పరుగులు గిల్‌వే! ఈ క్రమంలో 54 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో పాండ్యా (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) అవుట్‌కాగా కేవలం 6 పరుగులే వచ్చాయి. భారత్ పేస్‌కు కివీస్ బ్యాటర్స్ వణికారు. మూడో ఓవర్లోనే కివీస్ 7 పరుగులకే 4 వికెట్లను కోల్పోవడంతో భారత్ విజయానికి బాటపడింది. మిచెల్, సాన్‌ట్నర్ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.


సిరీస్ ట్రోఫీతో కెప్టెన్ హార్దిక్

స్కాన్ చేయండి
ఈ రోజు హైలైట్ కొరకు

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బ్రేస్‌వెల్ 1; గిల్ (నాటౌట్) 126; త్రిపాఠి (సి) ఫెర్గూసన్ (బి) సోధి 44; సూర్యకుమార్ (సి) బ్రేస్‌వెల్ (బి) టిక్నర్ 24; పాండ్యా (సి) బ్రేస్‌వెల్ (బి) మిచెల్ 30; హుడా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 234.**
వికెట్ల పతనం: 1-7, 2-87, 3-125, 4-228.
బౌలింగ్: లిస్టర్ 4-0-42-0, బ్రేస్‌వెల్ 1-0-8-1, ఫెర్గూసన్ 4-0-54-0, టిక్నర్ 3-0-50-1, ఇష్ సోధి 3-0-34-1, సాన్‌ట్నర్ 4-0-37-0, మిచెల్ 1-0-6-1. **న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** అలెన్ (సి) సూర్య (బి) పాండ్యా 3; కాన్వే (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్ 1; చాప్‌మన్ (సి) ఇషాన్ (బి) అర్ష్‌దీప్ 0; ఫిలిప్స్ (సి) సూర్య (బి) పాండ్యా 2; మిచెల్ (సి) మావి (బి) ఉమ్రాన్ 35; బ్రేస్‌వెల్ (బి) ఉమ్రాన్ 8; సాన్‌ట్నర్ (సి) సూర్య (బి) మావి 13; ఇష్ సోధి (సి) త్రిపాఠి (బి) మావి 0; ఫెర్గూసన్ (సి) ఉమ్రాన్ (బి) పాండ్యా 0; టిక్నర్ (సి) ఇషాన్ (బి) పాండ్యా 1; లిస్టర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (12.1 ఓవర్లలో ఆలౌట్) 66. వికెట్ల పతనం:** 1-4, 2-4, 3-5, 4-7, 5-21, 6-53, 7-53, 8-54, 9-66, 10-66. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 4-0-16-4, అర్ష్‌దీప్ సింగ్ 3-0-16-2, ఉమ్రాన్ మాలిక్ 2.1-0-9-2, కుల్దీప్ యాదవ్ 1-0-12-0, శివమ్ 2-0-12-2.

126 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత క్రికెటర్‌గా శుబ్‌మన్ గిల్ (126 నాటౌట్) గుర్తింపు పొందాడు. కోహ్లి (122 నాటౌట్; అఫ్గానిస్తాన్‌పై 2022 లో) పేరిట ఉన్న రికార్డును గిల్ సవరించాడు.

168 అంతర్జాతీయ టి20ల్లో పరుగుల తేడా పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం. 2018లో ఐర్లాండ్‌పై 143 పరుగుల తేడాతో సాధించిన విజయం రెండో స్థానానికి వెళ్లింది.

5 భారత్ తరఫున మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20లు) సెంచరీ సాధించిన ఐదో క్రికెటర్‌గా గిల్ నిలిచాడు. గతంలో రైనా, కేఎల్ రాహుల్, రోహిత్, కోహ్లి ఈ ఘనత సాధించారు.

ఆంధ్ర 379 ఆలౌట్

ఎడమచేతి వాటంతో బ్యాటింగ్ చేసిన విహారి


విహారి

ఇండోర్: డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 127.1 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు ఆటలో ఆంధ్ర కెప్టెన్ హనుమ విహారి (27; 3 ఫోర్లు) చేతి గాయంతో బాధపడుతున్నా జట్టు అవసరాలరీత్యా ఎడమచేతి వాటం బ్యాటింగ్ చేయడం హైలైట్‌గా నిలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్ మరో 235 పరుగులు వెనుకంజలో ఉంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ రెండు వికెట్లు తీయగా... నితీశ్ కుమార్ రెడ్డి, పృథ్వీరాజ్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 262/2తో ఆట కొనసాగించిన ఆంధ్ర ఒకదశలో 323/2తో పటిష్టంగా కనిపించింది. అయితే సెంచరీ పూర్తి చేసుకున్న కరణ్ షిండే (110; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు)... రికీ భుయ్ (149; 18 ఫోర్లు, 1 సిక్స్) ఐదు పరుగుల తేడాలో అవుటయ్యాక ఒక్కసారిగా ఆంధ్ర ఇన్నింగ్స్ కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 353/9గా నిలిచింది. ఈ దశలో తొలి రోజు ఆటలో గాయపడి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ హనుమ విహారి క్రీజులోకి వచ్చాడు. చేతి గాయాన్ని లెక్కచేయకుండా తన సహజశైలి కుడిచేతి వాటం బదులుగా ఎడమచేతి వాటంతో విహారి బ్యాటింగ్ చేసి ఔరా అనిపించాడు. చివరి వరుస బ్యాటర్ లలిత్ మోహన్ (22 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి హనుమ విహారి 26 పరుగులు జోడించి సారాంశ్ జైన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

జాతీయ స్కూల్స్ చెస్‌లో తెలంగాణకు ఏడు పతకాలు


యశ్వి జైన్

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు ఏడు పతకాలు లభించాయి. ఇందులో ఐదు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం ఉన్నాయి. అండర్-15 బాలుర విభాగంలో వేముల అద్వైత్ విఘ్నేశ్ (7.5 పాయింట్లు)... అండర్-15 బాలికల విభాగంలో యశ్వి జైన్ (7 పాయింట్లు)... అండర్-13 బాలుర విభాగంలో చల్లా సహర్ష (8 పాయింట్లు)... అండర్-11 బాలికల విభాగంలో మోదిపల్లి దీక్షిత (7.5 పాయింట్లు)... అండర్-9 బాలికల విభాగంలో పుంగవనం సంహిత (8 పాయింట్లు) పసిడి పతకాలు గెలిచారు. అండర్-7 బాలుర విభాగంలో ఆదుళ్ల దివిత్ రెడ్డి (7.5 పాయింట్లు) కాంస్యం, అండర్-7 బాలికల విభాగంలో బోగా వంశిక (7 పాయింట్లు) రజతం సాధించారు. పతకాలు సాధించిన వారికి నెలనెలా భారత గ్రాండ్‌మాస్టర్ ఎం.శ్యామ్‌సుందర్‌తో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ ప్రకటించారు.

ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్ 21-13, 21-14తో మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో కిరణ్ జార్జి (భారత్) 21-17, 19-21, 23-21తో చెయుక్ యి లీ (హాంకాంగ్)ను ఓడించాడు. అయితే భారత్‌కే చెందిన సమీర్ వర్మ, ప్రియాన్షు రజావత్, మిథున్ మంజునాథ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రియాన్షు 21-14, 19-21, 25-27తో హియో క్వాంగ్ హీ (దక్షిణ కొరియా) చేతిలో... సమీర్ వర్మ 14-21, 16-21తో లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో.. మిథున్ 18-21, 12-21తో నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ జోడీ 21-11, 21-16తో టై అలెగ్జాండర్-జోసెఫిన్ వు (కెనడా) ద్వయంపై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

సినిమా


రజనీకాంత్

జైసల్మేర్‌లో జైలర్

రాజస్థాన్‌లోని జైసల్మేర్‌కు వెళ్లారు 'జైలర్'. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్'. రమ్యకృష్ణ, తమన్నా, శివరాజ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్ ఓ అతిథి పాత్ర చేస్తున్నారు. ఇటీవలే చెన్నైలో ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న 'జైలర్' చిత్ర యూనిట్ ఇప్పుడు 'జైసల్మేర్'కు చేరుకుంది. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి ఆల్రెడీ రాజస్థాన్‌లో ల్యాండ్ అయ్యారు రజనీకాంత్. ఈ షెడ్యూల్ దాదాపు రెండు వారాలు జరగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్ – మోహన్‌లాల్‌పై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారని సమాచారం. ఇక ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలయ్యే అవకాశం ఉంది.

హెలికాప్టర్‌లో షూటింగ్‌కి...


కమల్‌హాసన్

హెలికాప్టర్‌లో షూటింగ్ లొకేషన్‌కు వెళుతున్నారు కమల్‌హాసన్. 1996లో హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కడపలోని గండికోట విలేజ్‌లో జరుగుతోంది. తిరుపతి నుంచి గండికోట లొకేషన్‌కు రోజూ హెలికాప్టర్‌లో వెళ్తున్నారు కమల్‌హాసన్. కాగా కమల్ హెలికాప్టర్ రైడ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి, కాల్షీట్స్, షూటింగ్ సమయం వృథా కాకుండా చూసేందుకు కమల్ ఇలా హెలికాప్టర్ రైడ్ చేస్తున్నారన్నది కోలీవుడ్ టాక్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్, బాబీ సింహా కీ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.

పల్లెటూరి ప్రేమ


'శశివదనే'లో ఓ దృశ్యం

పార్వతీశం, జశ్విక జంటగా వైభవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసా.. మనసా..'. వర్షా ముందాడ, మాధవి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను 'దిల్' రాజు విడుదల చేశారు. వైభవ్ మాట్లాడుతూ– ''ఓ గ్రామంలో బెలూన్స్ అమ్ముకునే మల్లిబాబు (పార్వతీశం), అదే ఊర్లో పనిచేసే హెల్త్ అసిస్టెంట్ సుజాత (జశ్విక)ను ప్రేమిస్తాడు. అయితే సుజాతకు మల్లిబాబు దూరం కావాల్సి వస్తుంది. ఆ తర్వాత వారిద్దరూ కలుసుకున్నారా? లేదా అనేది చిత్ర కథ'' అన్నారు. ''న్యూ ఏజ్ లవ్ స్టోరీ చిత్రమిది'' అన్నారు వర్షా ముందాడ, మాధవి.

ఆ పేరుని తెరపై చూడాలనుకున్నా!

– శౌరి చంద్రశేఖర్ టి. రమేష్

''మా నాన్న చంద్రశేఖర్‌గారు ప్రతివారం నన్ను ఏదో ఒక సినిమాకి తీసుకెళ్లేవారు. అలా చిన్నతనంలోనే సినిమాలపై ఇష్టం మొదలైంది. మా నాన్నగారు చనిపోయాక ఆయన పేరుని నా పేరులో పెట్టుకున్నాను. ఆ పేరుని తెరపై చూడాలనే నా కోరిక 'బుట్టబొమ్మ' ద్వారా తీరుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శౌరి చంద్రశేఖర్ టి. రమేష్. అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదల కానుంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న చంద్రశేఖర్ టి.రమేష్ మాట్లాడుతూ– ''రామ్ గోపాల్ వర్మ గారి కార్పొరేషన్‌లో పని చేశాను. ఈశ్వర్ నివాస్‌గారు దర్శకత్వం వహించిన నాలుగు హిందీ సినిమాలకు పని చేశాను. ఆ తర్వాత సుకుమార్‌గారి వద్ద 'జగడం' నుంచి 'పుష్ప' సినిమా వరకు పని చేశాను. మలయాళ మూవీ 'కప్పేల'ని సితార వారు రీమేక్ చేస్తున్నారని తెలిసి, నేనే సంప్రదించాను. 'కప్పేల'లోని మెయిన్ పాయింట్ తీసుకొని తెలుగు నేటివిటీకి తగ్గట్లు 'బుట్టబొమ్మ'లో మార్పులు చేశాం. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది'' అన్నారు.


శౌరి చంద్రశేఖర్

పదిహేనేళ్ల తర్వాత....


విజయ్, త్రిష

దాదాపు పదిహేనేళ్ల తర్వాత జోడీ కట్టారు హీరో విజయ్– హీరోయిన్ త్రిష. మహేశ్‌బాబు 'ఒక్కడు' తమిళ రీమేక్ 'గిల్లి' (2004)లో తొలిసారి జోడీ కట్టారు విజయ్, త్రిష. ఆ తర్వాత 'తిరుపాచ్చి'(2005), (తెలుగులో 'అన్నవరం'గా రీమేక్ అయ్యింది) తెలుగు 'అతనొక్కడే'కు తమిళ రీమేక్ 'ఆది' (2006), 'కురివి' (2008) సినిమాల్లో జంటగా నటించారు. తాజాగా విజయ్ కెరీర్‌లో 67వ చిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ ప్రకటించింది. దీంతో విజయ్, త్రిష ఐదోసారి స్క్రీన్ షేర్ చేసుకున్నట్లవుతుంది. 'మాస్టర్' తర్వాత హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. సంజయ్ దత్, ప్రియా ఆనంద్, అర్జున్ సర్జా, గౌతమ్ మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.

వింతగా మారబోతోంది


బ్రహ్మానందం

తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో భరత్ కుమార్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ, శ్రీనివాస్ కౌశిక్, సాయికృష్ణ గద్వాల్, విజయ్ కుమార్ నిర్మిస్తున్న చిత్రం 'కీడా కోలా'. ఎనిమిది ప్రధాన పాత్రలతో ఈ మూవీ రూపొందుతోంది. వారిలో బ్రహ్మానందం ఒక కీలక పాత్ర చేస్తున్నారు. బుధవారం బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 'మీ ప్రపంచం వింతగా మారబోతోంది' అని పోస్టర్‌పై క్యాప్షన్ ఇచ్చారు. ''ప్రతి ఇంట్లో ఉండే తాత పాత్రలో (వరదరాజు) బ్రహ్మానందంగారు కనిపిస్తారు'' అన్నారు తరుణ్ భాస్కర్.

లవ్.. యాక్షన్


రక్షిత్, కోమలి

రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ జంటగా సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శరవణ వాసుదేవన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'శశివదనే..' టైటిల్ సాంగ్‌ని డైరెక్టర్ హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటని హరిచరణ్, చిన్మయి శ్రీపాద పాడారు. ''లవ్, యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు సాయి మోహన్. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చోలేటి, కెమెరా: సాయికుమార్.

తెరపైకి జాక్సన్ జీవితం


మైఖేల్


జాఫర్

పాప్ సంగీత సామ్రాజ్యానికి రాజుగా వెలిగిన మైఖేల్ జాక్సన్ జీవితంతో 'మైఖేల్' పేరుతో బయోపిక్ రూపొందనుంది. ఈ చిత్రానికి ఆంటోయిన్ ఫుక్వా దర్శకుడు. మైఖేల్‌గా ఆయన సోదరుడు జెర్మైన్ కుమారుడు జాఫర్ జాక్సన్ నటించనున్నారు. వెండితెరపై యాక్టర్‌గా జాఫర్‌కు ఇదే తొలి చిత్రం. ''మా అంకుల్ కథలో నటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు జాఫర్. ''మైఖేల్ జాక్సన్ లక్షణాలు జాఫర్‌లో చాలా ఉన్నాయి. మైఖేల్‌గా నటించగల ఒకే ఒక్క వ్యక్తి జాఫర్ అని నమ్ముతున్నాను'' అన్నారు నిర్మాతల్లో ఒకరైన గ్రాహం. ఇక 1958 ఆగస్టు 29న పుట్టిన మైఖేల్ జాక్సన్ 2009 జూన్ 25న మరణించిన విషయం తెలిసిందే.

అయోమయంలో...


రణధీర్, శుభశ్రీ

రణధీర్, శుభశ్రీ జంటగా ఊర శ్రీను దర్శకత్వంలో 'అయోమయంలో అరవింద' సినిమా ఆరంభం అయింది. డాక్టర్ ప్రసాద్ మూరెళ్ల సహకారంతో లెక్కల మహేంద్రా రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వి. శ్రీనివాసరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్ కొట్టారు. మేడిది వెంకటేశ్వరరావు గౌరవ దర్శకత్వం వహించారు. ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు ఊర శ్రీను. ''ఇప్పటివరకు వచ్చిన కథలకు భిన్నంగా మా చిత్రకథ ఉంటుంది'' అన్నారు మహేంద్రా రెడ్డి. ''ఈ చిత్రంలో మంచి సందేశం ఇస్తున్నాం'' అన్నారు ప్రసాద్ మూరెళ్ల. ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్, సంగీతం: శివ కాకాని.

Published and Printed by V.Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey no 108/6,Prathipadu Village, Pentapadu Mandal, (West Godavari) and Printed at Jagati Publications Limited Survey no 108/6, Prathipadu Village, Pentapadu Mandal, (West Godavari), Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act), Phone No. 08818 280033. Fax No. 08818 281789 RNI Regn No. APTEL/2008/23807.